సాక్షి నిజామాబాద్

బుధవారం । 16 । జూలై । 2025



వ్యాపారం, బిట్ కాయిన్..
నిజామాబాద్‌కు చెందిన మోహిజ్ ఖాన్ వ్యాపారం, బిట్‌కాయిన్ పేరుతో రూ.8.50 కోట్లు వసూలు చేసి పరారయ్యాడు.
- 10లో ▸



పెద్దపులి జాడెక్కడ!
కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల అటవీ ప్రాంతాల్లో పెద్దపులి జాడ కోసం ఫారెస్ట్ అధికారుల అన్వేషణ కొనసాగుతోంది.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.2 /23.6

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

జిల్లా వ్యవసాయ అధికారిగా గోవింద్



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యవసాయాధికారిగా మేకల గోవింద్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిల్లా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గోవింద్ గతంలో జిల్లాలో డీఏవోగా పని చేసి రాష్ట్ర శాఖకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉండగా, ప్రభుత్వం మళ్లీ జిల్లాకు డీఏవోగా పోస్టింగ్ ఇచ్చింది ప్రభుత్వం. అయితే మొన్నటి వరకు ఇన్‌చార్జి డీఏవోగా పని చేసిన వీరాస్వామి నిజామాబాద్ అర్బన్ ఏడీఏగా రెగ్యులర్ పోస్టులో పని చేయనున్నారు.

లింబాద్రిగుట్టపై టూరిజం గెస్ట్‌హౌస్‌కు రూ.40లక్షలు


మోర్తాడ్: భీమ్‌గల్ మండలంలోని లింబాద్రి గుట్ట (లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయం) వద్ద పర్యాటకుల అతిథి గృహం నిర్మాణం కోసం రూ.40 లక్షలు మంజూరు చేస్తూ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. భక్తులు, అతిథుల సౌకర్యార్థం గెస్ట్‌హౌస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి మంత్రికి విన్నవించగా ఆయన నిధులు మంజూరు చేశారని నాయకులు తెలిపారు. నిధులు మంజూరి చేసిన మంత్రికి, అందుకు కృషి చేసిన నాయకులకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

సిద్దులగుట్టపై కాటేజీల నిర్మాణానికి..
ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై కాటేజీల నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరైనట్లు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి తెలిపారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆలయాన్ని సందర్శించిన సమయంలో నిధులు మంజూరు చేయాలని విన్నవించామన్నారు. మంత్రికి వినయ్‌రెడ్డితోపాటు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎఫ్‌పీవోల సంఖ్య పెంచేందుకు చర్యలు



సుభాష్‌నగర్: రాష్ట్రంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో)ల సంఖ్యను పెంచి ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంస్థల పెంపునకు సంబంధించి అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రాష్ట్రంలో ఎఫ్‌పీవోలుగా ఎంపికైన 311 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నిర్వహణ వ్యయాల మొదటి విడత చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. 311 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా రూపాంతరం చెందాయన్నారు. అందులోభాగంగా నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో 34 (నిజామాబాద్ 12, కామారెడ్డి 22) పీఏసీఎస్‌లు ఎఫ్‌పీఓలుగా ఉన్నాయని తెలిపారు. తద్వారా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడి సామూహిక అభివృద్ధి చెందుతారన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్లు, జిల్లా సహకార అధికారులు, రైతులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తన బృందంతో కలిసి సురక్షితంగా భూమికి చేరుకోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. భరతమాత కీర్తిని మరింత పెంచేలా శుభాంశు చేసిన అంతరిక్ష యాత్ర విజయవంతం కావడం గర్వకారణమంటున్నారు.

జై భారత్.. జై శుభాంశు

- భారత వ్యోమగామి అంతరిక్ష యాత్ర విజయవంతం
- నాసా నలుగురి బృందంలో భారతీయుడు
- దేశ ప్రజలందరికీ గర్వకారణమంటూ సర్వత్రా హర్షం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భారతదేశం నుంచి రెండోసారి అంతరిక్ష యాత్రకు వెళ్లి 18 రోజుల పాటు 60 రకాల పరిశోధనలు చేసి విజయవంతంగా తిరిగొచ్చిన శుభాంశు శుక్లా జయహో అంటూ జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాసా తరఫున అంతరిక్షంలో భవిష్యత్తు మానవాళికి ఉపయోగపడేవిధంగా పరిశోధనలు చేసేందుకు వెళ్లిన నలుగురి బృందంలో భారతీయుడైన శుభాంశు ఉండడం దేశ ప్రజలందరికీ గర్వకారణమంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా దేశ ప్రజలందరూ శుభాంశు విజయవంతంగా తిరిగి రావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీ మాట్లాడుతూ ఈ యాత్ర కోట్లాది మంది కలలకు ప్రేరణగా నిలుస్తోందన్నారు. భారత స్పేస్ మిషన్‌కు ఎంతో ఉపయోగకరమన్నారు. ఇది ఇస్రో చేపట్టనున్న గగన్‌యాన్‌కు మరో మైలురాయి అన్నారు. కీలకమైన మిషన్‌లో భారతీయ వ్యోమగామి కీలకపాత్ర పోషించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మరిన్ని పరిశోధనలకు ఆదర్శంగా తీసుకోవాలి



రాకేశ్ శర్మ తరువాత రెండో భారత జాతీయుడు అంతరిక్షంలో పరిశోధన కోసం వెళ్లడం గొప్ప విషయం. శుభాంశు శుక్లా పరిశోధన యాత్రను ఆదర్శంగా తీసుకుని యువత, విద్యార్థులు మరిన్ని పరిశోధనలు చేయడమే లక్ష్యంగా దూసుకెళ్లాలి. ముఖ్యంగా భారతీయ యువత అన్నిరంగాల్లో తమ సత్తా నిరూపించుకుంటున్నారు. గూగుల్, మైక్రో సాఫ్ట్ మొదలు దాదాపు 25 మల్టీ నేషనల్ కంపెనీలకు సీఈవోలుగా భారతీయులు సత్తా చాటుతున్నారు. పలువురు టెక్నోక్రాట్లు నాసాలో అనేక పరిశోధనలు చేస్తున్నారు. చాలా పశ్చిమ దేశాల్లో భారతీయ వైద్యులు తిరుగులేని సర్జన్లుగా, వైద్య నిపుణులుగా సేవలందిస్తున్నారు. అనేక ఆవిష్కరణలు చేస్తున్నారు.

– కాటిపల్లి మహేందర్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది

విద్యార్థులు స్ఫూర్తి పొందాలి



శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర విజయవంతం కావడంపై ప్రతి భారతీయుడు గర్వపడాలి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వివిధ పరిశోధనలు చేసి విజయవంతంగా తిరిగిరావడం సంతోషకరం. విద్యార్థులు శుభాంశు శుక్లాను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలి. కలలు కనండి, వాటిని నిజం చేసుకోండి అని మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన సూక్తిని పరిగణనలోకి తీసుకుని విద్యార్థులు స్ఫూర్తి పొందాలి. ఆకాశమే హద్దుగా మానవాళికి ఉపయోగపడేవిధంగా పరిశోధనలు చేసే లక్ష్యంతో విజ్ఞానాన్ని సముపార్జించుకుంటూ గొప్పగా ఎదగాలి.

– టి వినయ్ కృష్ణారెడ్డి, కలెక్టర్

దేశానికి గర్వకారణం



భరతమాత కీర్తిని మరింత పెంచే విధంగా శుభాంశు శుక్లా చేసిన ఈ అంతరిక్ష యాత్ర విజయవతం కావ దం మనందరికీ గర్వకారణం. భారతీయ వేదాలు, ఉపనిషత్తులు, పురాణాల్లో అనేక విజ్ఞానదాయకమైన అంశాలున్నాయి. వీటి ఆధారంగా అనేక పరిశోధనలు చేసి ధన్వంతరి, శుశ్రుతుడు, పతంజలి, వాగ్భటులు, చరకుడు, చాణ క్యుడు, ఆర్యభట్ట లాంటి భారతీయ మునులు, శాస్త్రవేత్తలు, శ్రీనివాస రామానుజన్, సీవీ రామన్, శకుంతలాదేవి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, జగదీష్ చంద్రబోస్, హోమీబాబా, సతీష్ ధావన్, నంబి నారాయణన్ లాంటి వారు అందించిన విజ్ఞానాన్ని గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలి. వీళ్లందరి స్ఫూర్తితో, తాజాగా శుభాంశు శుక్లాను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు అకుంఠిత దీక్షతో చదివి దేశానికి ఉపయోగపడే భావి భారత పౌరులుగా ఎదగాలి. దేశ కీర్తిని సగర్వంగా చాటే లక్ష్యంతో ముందుకెళ్లాలి.

– మోతుకూరి రేణుక, హిందీ పండిత్

నేడు తెయూ కాన్వొకేషన్

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాక
- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ రెండో కాన్వొకేషన్ బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. వర్సిటీ చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు కానున్నారని, ఏర్పాట్లను పూర్తి చేశామని వైస్ చాన్సలర్ టీ.యాదగిరిరావు తెలిపారు. రాజ్‌భవన్ నుంచి వచ్చిన పోలీసు అధికారులు, నిజామాబాద్ సీపీ సాయిచైతన్య మంగళవారం క్యాంపస్‌ను సందర్శించి కాన్వొకేషన్ వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. స్నిఫర్ డాగ్ స్క్వాడ్ బృందం, బాంబ్ డిస్పోజబుల్ టీం అధికారులు వేదికను నిశితంగా తనిఖీ చేశారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్‌కు చెందిన సిబ్బంది, బ్యాండ్ టీం గవర్నర్‌కు గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) సమర్పించనున్నారు. రిహార్సల్స్‌లో భాగంగా ఆర్ఎస్సై కే.శ్రీకాంత్ ఆధ్వర్యంలో తెయూ వీసీ యాదగిరిరావు, సీపీ సాయిచైతన్యకు గౌరవ వందనం సమర్పించారు. వీసీ ప్రొఫెసర్ టీ.యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, కంట్రోలర్ ప్రొఫెసర్ సంపత్‌కుమార్, డీన్స్‌లతో కలిపి మాక్ సెషన్ నిర్వహించారు. మాక్ డ్రిల్‌లో కాన్వొకేషన్ నిర్వహణ కమిటీల కన్వీనర్లు, ప్రొఫెసర్‌లు ఘంటా చంద్రశేఖర్, కనకయ్య, అపర్ణ, ఆరతి, రాంబాబు, ఆంజనేయులు, కె.రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాల, అసోసియేట్ ప్రొఫెసర్ నాగరాజు, పీఆర్వో ఏ.పున్నయ్య, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన సాగుతుందిలా..
గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం ఉదయం 8.30 గంటలకు రాజ్‌భవన్ నుంచి రోడ్డుమార్గం ద్వారా బయల్దేరి 11.10 గంటలకు డిచ్‌పల్లిలోని టీజీఎస్పీ ఏడో బెటాలియన్‌కు చేరుకుంటారు. బెటాలియన్‌లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన తర్వాత 15 నిమిషాలు విశ్రాంతి తీసుకుంటారు. 11.25 గంటలకు బెటాలియన్ నుంచి బయల్దేరి 11.30 గంటలకు తెలంగాణ యూనివర్సిటీకి చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు తెయూ కాన్వొకేషన్‌లో పాల్గొంటారు. వర్సిటీ నుంచి 1.05 గంటలకు బయల్దేరి 1.10 గంటలకు బెటాలియన్‌కు చేరుకుని అక్కడే భోజనం చేస్తారు.

మధ్యాహ్నం 2.30 గంటలకు బెటాలియన్ నుంచి బయల్దేరి 2.50 గంటలకు నిజామాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుంటారు. 3 నుంచి 4 గంటల వరకు జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలైన రచయితలు, కళాకారులతో మాట్లాడుతారు. సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు జిల్లా టీబీ అధికారులు, ఐఆర్‌సీఎస్ ప్రతినిధులతో సమావేశమవుతారు. 4.30 నుంచి 4.45 గంటల వరకు విశ్రాంతి తీసుకుని 4.45 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరుతారు.



యూనివర్సిటీలో సెల్ఫీ పాయింట్

130 మంది విద్యార్థులు.. 157 మంది పరిశోధకులు

2014 నుంచి 2023 వరకు 15 పోస్టుగ్రాడ్యుయేట్ (పీజీ) విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 130 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 18 విభాగాల్లో పరిశోధనలు పూర్తి చేసుకున్న 157 మందికి అధికారికంగా పీహెచ్‌డీ పట్టాలను అందజేస్తారు. బంగారు పతకాలను, పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలను గవర్నర్ తో పాటు ముఖ్యఅతిథి చేతుల మీదుగా అందజేసి సత్కరిస్తారు.


తెయూ వీసీ, రిజిస్ట్రార్‌లతో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

ఎస్సారెస్పీలోకి నిలిచిన ఇన్‌ఫ్లో

- సీజన్‌లో వరద రాకపోవడంతో రైతుల్లో ఆందోళన

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద (ఇన్‌ఫ్లో) నిలిచి పోయింది. ప్రస్తుత సీజన్‌లో మేలోనే ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చి ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరిగింది. దీంతో సకాలంలో ప్రాజెక్టు నిండుతుందని రైతులు ఆశించగా, ప్రస్తుతం ఇన్‌ఫ్లో నిలిచిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆయకట్టు రైతులు వర్షాల ఆధారంగా నారు మడులను సిద్ధం చేసుకున్నారు. సకాలంలో వరదలు వస్తే ప్రాజెక్ట్‌నుంచి కాలువల ద్వారా ఆయకట్టుకు నీరు విడుదలవుతుందని ఆశించారు. కానీ ప్రస్తుత పరిస్థితి వారి ఆశలకు విరుద్ధంగా ఉంది.

ఎగువన ఖాళీనే..
ఎస్సారెస్పీలోకి ప్రధానంగా వరద వచ్చే మహారాష్ట్ర ప్రాంతంలోని గైక్వాడ్, విష్ణుపురి ప్రాజెక్టులు కూడా ఖాళీగా ఉన్నాయని ప్రాజెక్టు అధికారులు తెలుపుతున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కూడా ప్రస్తుతం వర్షపాతం లేదని, ఇప్పటికిప్పుడు వరదలు వచ్చే అవకాశం లేదని ప్రాజెక్ట్ అధికారులు అంటున్నారు. 2018 నుంచి ప్రాజెక్ట్‌లోకి ప్రతి ఏడాది జూలై చివరి నాటికి వరద నీరు చేరగా, ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు.

నిలకడగా నీటి మట్టం
ప్రాజెక్ట్ నీటి మట్టం ప్రస్తుతం నిలకడగా ఉంది. కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ఆవిరి రూపంలో 367 క్యూసెక్కుల నీరు పోతోంది. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 1068.50 (21 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్: ఆయకట్టు కింద సాగవుతున్న పంటల కోసం మంగళవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలను ప్రారంభించారు. ప్రధాన కాలువ కింద 1.4 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. మొదటి ఆయకట్టు ప్రాంతంలో వరినాట్లు వేస్తున్నారు. ఆయకట్టు పంటల కోసం ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

నకిలీ ఏజెంట్లను నమ్మొద్దు

- ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి
- సీపీ సాయి చైతన్య

ఖలీల్‌వాడి: ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసే నకిలీ గల్ఫ్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని సీపీ పోతరాజు సాయిచైతన్య మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. నిరుద్యోగుల నుంచి పాస్‌పోర్టు, వీసా, రవాణా, టూరిస్ట్ తదితర సేవలు కల్పిస్తామని చెప్పి చాలా మంది గల్ఫ్ ఏజెంట్లు అనధికార వ్యాపారాలు నిర్వహిస్తూ, అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. గల్ఫ్ ఏజెంట్లకు ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రజలకు సీపీ సూచించారు. ఒక ఇల్లు అద్దెకు ఇవ్వాల్సి వస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని పేర్కొన్నారు. అలాగే ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు పలు నిబంధనలను కమిషనరేట్‌పరిధిలో అమలులో ఉంటాయని ప్రకటనలో వివరించారు.



ప్రజలకు ఇబ్బందులు కలిగేలా విగ్రహాలను ప్రతిష్టించొద్దని, విగ్రహాల ఏర్పాటుకు కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. రెసిడెన్షియల్, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబుల్స్ సౌండ్ వాడాలని రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేల సౌండ్ సిస్టంను నిషేధించినట్లు పేర్కొన్నారు. సభలు, సమావేశాలకు ఏసీపీ అనుమతి తప్పనిసరి అని, 500 కన్నా ఎక్కువ మందితో నిర్వహించే కార్యక్రమానికి 72 గంటల ముందు సీపీ అనుమతి తీసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తప్పవని, డ్రోన్‌ల వినియోగానికి పోలీసు, ఏవియేషన్ తదితరశాఖల అధికారుల క్లియరెన్స్ తప్పనిసరి అని స్పష్టం చేశారు.

ఆడ శిశువును వదిలేశారు..

ఖలీల్ వాడి: జిల్లా కేంద్రంలో పద్మానగర్‌లోని ఓ ఇంటి పక్కన చీకటిలో మంగళవారం రాత్రి నవజాత ఆడ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు పడేసి వెళ్లిపోయారు. శిశువు ఏడుపు విని రోడ్డు పైన వెళ్లేవారు, చుట్టు పక్కల ఉండేవారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పసికందు లేత చర్మంపై గాయాలయ్యాయి. శిశువును జీజీహెచ్‌కు తరలించారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.



సమన్వయంతో అభివృద్ధి సాధిద్దాం

- కామారెడ్డి జిల్లా సమీక్ష సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి సీతక్క

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సూచించారు. మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన కలెక్టరేట్ స మావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, పోచారం శ్రీనివాస్‌రె డ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనితా రా మచంద్రన్, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు తదితరులు పాల్గొన్నారు. పలు శాఖలపై మంత్రి సీతక్క సమీక్షించారు. వివిధ శాఖల అధికారుల పనితీరుపై ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు మనసుపెట్టి పనిచేయాలన్నారు. సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని, మీరు మంచి చేస్తే ప్రభుత్వానికి మంచి పేరొస్తుందని పేర్కొన్నారు. సమస్య ఉందని తెలియగానే దాన్ని పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. ఒకవేళ సమస్య తీవ్రమైనదైతే ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రుల దృష్టికి తీసుకురావడం ద్వారా అది జటిలం కాకుండా చూడవచ్చన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. డెంగీ ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు..
లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను వేగంగా నిర్మించుకునేలా అధికారులు చూడాలని మంత్రి సూచించారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారికి సెర్ప్, డ్వాక్రాల ద్వారా రుణాలు ఇప్పించి సహకరించాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజూరైన రోడ్ల నిర్మాణాలకు వెంటనే టెండర్లు పిలిచి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా శక్తి భవనాలను నవంబర్ 19న ప్రారంభించేందుకు సిద్ధం చేయాలన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ భవనాల లెక్కలు తీయాలని, వాటికి సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయడానికి రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఎస్పీ రాజేశ్ చంద్ర, జిల్లా అటవీ అధికారి నిఖిత, సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఏఎస్పీ చైతన్య పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క, వేదికపై ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్, పోచారం, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు

అమ్మకు ఉద్యోగుల బోనం

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ ఆవరణలో బోనాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితోపాటు టీఎన్జీవోస్ రాష్ట్ర నాయకులు, కలెక్టర్, సీపీ బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు.

– నిజామాబాద్ అర్బన్


బోనం ఎత్తుకున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పూజా సామగ్రితో ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎస్పీ సాయిచైతన్య

క్లుప్తంగా

విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం



పిట్లం(జుక్కల్): విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ వద్ద మంగళవారం జుక్కల్ నియోజక వర్గం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై, విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 9 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. ఫిర్యాదులను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు.

సాలూర సొసైటీకి రాష్ట్రస్థాయి అవార్డు



బోధన్: రైతులకు ఉత్తమ సేవలందిస్తూ ఆర్థికంగా పురోగతి సాధించిన సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా అవార్డు అందుకుంది. హైదరాబాద్‌లోని నాబార్డు (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) రీజినల్ ఆఫీస్‌లో మంగళవారం 44వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా సొసైటీ సీఈవో బస్వంత్‌రావు అవార్డు అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో వివిధ జిల్లాలకు చెందిన పలు సొసైటీలను అవార్డుకు ఎంపిక చేశారు. జిల్లాలో సాలూర సొసైటీకే అవార్డు దక్కింది. ఈసందర్భంగా సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ మాట్లాడుతూ.. సొసైటీ ఉత్తమ సేవలు, ఆర్థికాభివృద్ధికి సహకరించిన పాలకవర్గ సభ్యులు, రైతులు, సిబ్బంది, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దపులి జాడెక్కడ!

- మూడో రోజూ కొనసాగిన గాలింపు చర్యలు
- అడవిని జల్లెడ పడుతున్నా లభించని ఆచూకీ
- నలుగురిని అరెస్ట్, రిమాండ్



రెడ్డిపేట అడవిలో గాలిస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పులి జాడ కోసం అటవీ అధికారులు చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ మూడో రోజూ కొనసాగింది. ఎస్ 12 నంబరుగల పులి తిరుగుతున్నట్లు ఇప్పటికే నిర్ధారణకు వచ్చిన అధికారులు.. దాని జాడ కనిపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మూడు బృందాలు రామారెడ్డి, మాచారెడ్డి, సిరికొండ మండలాల పరిధిలోని అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. పులి కదలికలను కనిపెట్టేందుకు ఏర్పాటు చేసిన కెమెరాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. అలాగే డ్రోన్ కెమెరాలతో అడవిని జల్లెడ పడుతున్నారు. కనీసం దాని కదలికలు దొరికినా అటువైపు వెళ్లాలని ప్రయత్నిస్తున్నారు. పులి ఏ ప్రాంతంలో పశువులపై దాడి చేసిందో ఆ ప్రాంతం నుంచి చుట్టుపక్కల అడవిలో ఉన్న లోయలు, గుట్టల్లో గాలింపు కొనసాగుతోంది. రెస్క్యూ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. మూడు రోజులుగా చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటికైతే సఫలం కాలేదని అటవీ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది.

నలుగురు నిందితుల అరెస్టు

అటవీ ప్రాంతంలోకి అక్రమంగా చొరబడడం, వన్య మృగాలను చంపడానికి ప్రయత్నించిన నేరాలపై రామారెడ్డి మండలంలోని స్కూల్ తండాకు చెందిన నలుగురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో బూక్య మహిపాల్, గంగావత్ కన్నీరాం, సలావత్ గోపాల్, పిపావత్ సంజీవ్‌లను అరెస్టు చేసినట్టు జిల్లా అటవీ అధికారి నిఖిత తెలిపారు. వారికి 14 రోజుల రిమాండు విధించినట్లు వివరించారు.

సిరికొండ రేంజ్ పరిధిలో..

సిరికొండ: పెద్దపులి జాడ కోసం మండల పరిధిలోని అడవుల్లో అన్వేషణ కొనసాగుతోంది. మాచారెడ్డి రేంజ్ పరిధిలో ఆవును చంపిన పెద్దపులి జాడకోసం సిరికొండ రేంజ్ పరిధిలోని తూంపల్లి, పందిమడుగు సెక్షన్ పరిధి తిరుపతి గుట్ట, పాకాల సౌత్ బీట్‌ల పరిధిలో మంగళవారం స్థానిక అటవీ శాఖ అధికారులు గాలించారు. ఎన్జీవో టైగర్ ట్రాకర్ యోగేశ్, తూంపల్లి, పందిమడుగు సెక్షన్ అధికారులు కృష్ణగీత్, సాయికిరణ్, బీట్ అధికారులు నాగేశ్, సతీశ్, హరీశ్ అటవీ ప్రాంతంలో నీటి కుంటల వద్ద, ఒర్రెల్లో పులి పాదముద్రల జాడ కోసం వెతికారు. ఎక్కడా కూడా పులి తిరిగిన ఆనవాళ్లు కనిపించలేదని వారు తెలిపారు.



టైగర్ ట్రాకర్ యోగేశ్‌తో స్థానిక అధికారులు

ఎస్పీ నుంచి సీపీగా జిల్లా పోలీస్ బాస్

మీకు తెలుసా?



నిజామాబాద్‌లోని సీపీ కార్యాలయం

రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబర్‌లో దసరా రోజున ప్రారంభించిన కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలతో పాటు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌ను ఏర్పాటు చేసింది.

- నిజామాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభాను మెరుగ్గా నిర్వహించడానికి, శాంతిభద్రతల సంక్లిష్టతను పరిష్కరించడానికి నిజామాబాద్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (SP)ను, కమిషనర్ ఆఫ్ పోలీస్ (CP)గా అప్‌గ్రేడ్ చేశారు.
- సీపీ నేరుగా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (DGP)కి నివేదిస్తుంది, నిర్ణయం తీసుకోవడాన్ని క్రమబద్ధీకరిస్తుంది. ఒక కమిషనరేట్ నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి ట్రాఫిక్, శాంతిభద్రతలు, నేర శాఖలు వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయవచ్చు.
- సీపీ మార్పుతో జిల్లాలోని పోలీసు అధికారుల హోదాల్లో మార్పు వచ్చింది. జిల్లా పోలీస్ బాస్‌ను సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) నుంచి కమిషనర్ ఆఫ్ పోలీస్ (సీపీ)గా మార్పు చేశారు.
- జిల్లాలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డీఎస్పీల హోదాల్లో సైతం మార్పు వచ్చింది. నాటి నుంచి నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించే డీఎస్పీలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా పిలవడం ప్రారంభించారు.
- జిల్లాలో అదనంగా మెండోర, ముప్కాల్, ఏర్గట్ల, ఆలూర్, డొంకేశ్వర్ పోలీస్ స్టేషన్లు చేర్చబడ్డాయి. సిరికొండ పోలీస్ స్టేషన్‌ను ధర్పల్లి సర్కిల్‌లో విలీనం చేసి నిజామాబాద్ సబ్ డివిజన్ పరిధిలోకి తీసుకున్నారు.

– ఆర్మూర్

అట్టహాసంగా బోనాల పండుగ



నగరంలోని పాత కలెక్టరేట్ వద్ద పోతరాజులు, టీఎన్జీవోస్ రాష్ట్ర నాయకులతో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, నాయకులు



బోనంతో నృత్యం చేస్తున్న శివశక్తి అమ్మవారు

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో బోనాల కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలతోపాటు అధికారులు బోనమెత్తి అమ్మవారిని కొలిచారు. వేడుకల్లో ఆయా శాఖల మహిళ ఉద్యోగులు బోనాలతో హాజరయ్యారు. బోనాల ఊరేగింపులో నాని యాదవ్ మాతంగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమ్మవారి బోనంతో విన్యాసాలు చేస్తూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు క్షేమంగా ఉండాలని, అమ్మదయ అందరిపై ఉండాలని కోరారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్, రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు నరసింహరెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుమన్, శేఖర్, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





బోనాల ఊరేగింపులో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, నారాయణరెడ్డి, రమణారెడ్డి, తదితరులు



అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, సీపీ సాయిచైతన్య, టీఎన్జీవోస్ నాయకులు



పోతురాజు విన్యాసం

నారుమడి తడి కోసం తంటాలు



భవానీపేటలో వరి నారును కాపాడుకోవడానికి ట్యాంకరుతో నీరు పెడుతున్న రైతు



తాళ్లరామడుగు వడ్డెర కాలనీలో..

లింగంపేట/సిరికొండ: తీవ్ర వర్షాభావం వల్ల వరి నార్లు ఎండిపోతుండడంతో రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన వర్షాలు పడకపోవడంతో బోరు బావులు వట్టిపోతున్నాయి. జూన్‌లో అడపాదడపా వర్షాలు కురిసినా జూలైలో వర్షాలు కురవక పంటల సాగు ఇబ్బందికరంగా మారింది. రైతులు తుకాలు పోసిన నుంచి వర్షాలు పడక ఎండిపోతున్నాయి. దీంతో తుకాలు కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లింగంపేట మండలంలోని భవానీపేట గ్రామానికి చెందిన బ్యాగరి సాయిలు, ఆర్ల బాల సాయిలు గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను కిరాయికి తీసుకొని నారు మడికి నీరు పెడుతున్నారు. వీరు గ్రామ శివారులోని పంట చేను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నారు. అలాగే సిరికొండ మండలం తాళ్లరామడుగు వడ్డెర కాలనీకి చెందిన రైతు రాజకిషన్ తన బోరు పోయక వరి నారుమడి ఎండిపోతుండటంతో ట్యాంకర్ ద్వారా నీళ్ల పోసి బతికించుకుంటున్నాడు. రాబోయే రోజుల్లో వర్షాలు కురిస్తే పంటలు సాగు చేయడానికి వరినారు కాపాడుకుంటున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురవకపోతే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కోసం ప్రతీరోజు ఆకాశం వైపు చూస్తూ వరుణ దేవుడిని వేడుకుంటున్నామని వాపోయారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



నిజామాబాద్ నాగారం: నగరంలోని ఐడీఓసీలో మంగళవారం క్షయ వ్యాధిగ్రస్తులకు డీఎంహెచ్‌వో రాజ్యశ్రీ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా రాజ్యశ్రీ మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం నిమిత్తం న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయడం చాలా హర్షించదగ్గ విషయమని రెడ్ క్రాస్ సభ్యులను అభినందించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ బుస ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, జిల్లా కోశాధికారి కరిపే రవీందర్, డాక్టర్ సుప్రియ, ఘన్పూర్ వెంకటేశ్వర్లు, శ్యామల, నాగరాజు, తదితరులున్నారు.

రౌడీషీటర్ అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఆటో డ్రైవర్‌ను కొట్టి కత్తులతో బెదిరించి రూ. 400 ఎత్తుకెళ్లిన కేసులో ప్రధాన నిందితుడు రౌడీషీటర్ బర్సాత్ ఆమీర్‌తోపాటు షాబాజ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసి, రిమాండ్ చేశారు. రౌడీషీటర్లు బెదిరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.







క్రైం కార్నర్

బొలెరో వాహనం బోల్తా



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నాందేడ్–సంగారెడ్డి జాతీయ రహదారిపై మంగళవారం సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం ప్రమాదవశాత్తు బోల్తాపడింది. సంగారెడ్డి జిల్లా బాచేపల్లి నుంచి సిమెంట్ లోడ్ వస్తున్న బొలెరో వాహనం మండలంలోని వెల్గనూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై అదుపు తప్పి, రోడ్డు కిందకు వెళ్లి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహన డ్రైవర్ తోపాటు మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయని హైవే సిబ్బంది తెలిపారు.

సిమెంట్ దుకాణంలో అగ్ని ప్రమాదం



బాల్కొండ: మండల కేంద్రంలోని శాంభవి సిమెంట్ దుకాణంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 10 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అర్ధరాత్రి దుకాణం నుంచి మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారమందించారు. వెంటనే ఫైర్‌సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో వచ్చి మంటలను ఆర్పివేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చేనులో మూర్ఛతో రైతు మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): పంట చేనులో పనులు చేస్తుండగా ఓ రైతు మూర్ఛ వ్యాధితో మృతిచెందిన ఘటన మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై దీపక్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా.. శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన మార్గ రాజు(38) అనే రైతు సోమవారం తన పంట చేనులో పొలం దున్నడానికి వెళ్లాడు. రాత్రి వరకు అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి, వెతకసాగారు. పొలంలో రాజు మూర్ఛతో బోర్లా పడిఉన్నట్లు గమనించారు. అతడిని లేపి చూడగా అప్పటికే ప్రాణాలు పోయినట్లు గుర్తించారు. మృతుడి కుటుంబసభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. తన భర్త మరణంలో ఎలాంటి అనుమానాలు లేవని అతడి భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వర్ని: మండలంలోని శంకోరా గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. వర్ని ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా.. శంకోరా గ్రామానికి చెందిన పాల్య రవీందర్ ఈనెల 13న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఇంటికి రాగా, ఇంటి తాళాలతోపాటు బీరువా తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండు తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.18 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యాపారం, బిట్ కాయిన్ పేరిట ఘరానా మోసం

- రూ. 8.50 కోట్లతో పరారైన నగరవాసి
- విచారణ చేపట్టిన సీసీఎస్ పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని అహ్మదీనగర్‌కాలనీకి చెందిన మోహిజ్‌ఖాన్ వ్యాపారం, బిట్‌కాయిన్ పేరిట ఘరానా మోసానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. మోహిజ్‌ఖాన్ వ్యాపారం, బిట్ కాయిన్‌లో రూ. 5 లక్షలు చెల్లిస్తే రూ.50 వేలు నెలకు వస్తాయని స్థానిక ప్రజలను నమ్మించారు. కొందరు మోహిజ్‌ఖాన్‌ను నమ్మి రూ. 5లక్షలు చెల్లించడంతో నెలకు రూ.50వేలు చెల్లించాడు. ఇలా కొన్ని నెలలపాటు అతడు పెట్టుబడి పెట్టిన వారికి డబ్బులు చెల్లించారు. ఈ విషయం తెలిసి మరింత మంది అతడికి రూ. లక్షల్లో డబ్బులు చెల్లించారు. ఇలా అతడు సుమారు రూ.8.50 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. పెద్ద మొత్తంలో డబ్బులు రావడంతో ఇటీవల మోహిజ్‌ఖాన్ పరారయ్యారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితులు మంగళవారం రెండో టౌన్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు ఛేదించడానికి సీసీఎస్ పోలీసులను సీపీ పోతరాజు సాయిచైతన్య ఆదేశించారు. వారు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు.

ఇసుక క్వారీ పనుల అడ్డగింత



సుంకినిలో ఇసుక క్వారీ పనులను అడ్డుకున్న రైతులు

రుద్రూర్: పోతంగల్ మండలం సుంకిని శివారులోని మంజీరా నదిలో ఇసుక క్వారీ ఏర్పాటు పనులను మంగళవారం స్థానిక రైతులు అడ్డుకున్నారు. గత వారం రోజులుగా కొందరు వ్యక్తులు తమకు క్వారీ ఏర్పాటుకు అనుమతి లభించిందని పేర్కొంటూ ర్యాంపు పనులు ప్రారంభించారు. ఇసుక ర్యాంపు ఏర్పాటు పట్ల స్థానిక రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. క్వారీ ఏర్పాటు చేస్తే మంజీర తీరప్రాంతంలో ఉన్న ఎత్తిపోతల పథకాలు వట్టి పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ నిర్వహణ గూర్చి రెవెన్యూ అధికారులకు, స్థానికులకు కూడా ఎలాంటి సమాచారం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను నిలిపివేయాలని నినాదాలు చేశారు. అనుమతులు లేకుండా ఇసుక క్వారీ కోసం ఏర్పాట్లు చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ గంగాధర్ ఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. మూడు టిప్పర్లను సీజ్ చేసి కోటగిరి పోలీస్ స్టేషన్ తరలించారు.

మొరం ట్రాక్టర్, పొక్లెయిన్ సీజ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బాణాపూర్ గ్రామ శివారులోని దండ్ల గుట్టపైన అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నందున సోమవారం రాత్రి మొరం ట్రాక్టర్, పొక్లెయిన్ పట్టుకున్నట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి, వాటిని లింగంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో, మండల కేంద్రంలో అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా మొరం తవ్వకాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

డోంగ్లీ మండలంలో మూడు మొరం ట్రాక్టర్లు..

సాక్షి ఎఫెక్ట్..

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని మొగా–డోంగ్లీ ప్రధాన రహదారిపై అక్రమంగా తరలుతున్న మూడు మొరం ట్రాక్టర్‌లను పట్టుకొని సీజ్ చేసినట్లు డోంగ్లీ ఆర్‌ఐ సాయిబాబా తెలిపారు. సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన 'మొరం అక్రమ తరలింపుపై చర్యలేవి?' అనే వార్త కథనానికి డోంగ్లీ రెవెన్యూ అధికారులు స్పందించారు. ఉమ్మడి మండలంలో అక్రమంగా మొరం, మట్టిని తరలిస్తుండటంతో మొగా గ్రామ శివారులో దాడులు నిర్వహించామని ఆయన తెలిపారు. మండలంలో ఎక్కడైన అక్రమంగా మొరం, మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయనతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు

- వృద్ధురాలికి గాయాలు

గాంధారి(ఎల్లారెడ్డి): స్తంభం నుంచి విద్యుత్ తీగలు తెగిపడటంతో ఓ వృద్ధురాలికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. మండలంలోని చిన్న పోతంగల్‌లో ఆకిటి భూదవ్వ అనే వృద్ధురాలు మంగళవారం ఉదయం పశువుల కొట్టం శుభ్రం చేసి తిరిగి ఇంటికి వెళ్తుండగా సమీపంలోని విద్యుత్ స్తంభం నుంచి అకస్మాత్తుగా కరెంట్ వైర్ తెగిపడింది. ఆమె భయపడి చేతితో తీగలను పక్కకు లాగే ప్రయత్నం చేయగా, షాక్ గురై పడిపోయింది. స్థానికులు గమనించి కర్రలతో తీగలను తొలగించి ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది తెగిన తీగల స్థానంలో నూతన తీగలను అమర్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

రాహుల్‌తేజపై జిల్లాలోనూ కేసు

ఖలీల్‌వాడి: కొంపల్లి డ్రగ్స్ కేసులో కీలక సూత్రధారి అయిన రాహుల్‌తేజపై నిజామాబాద్ జిల్లాలోనూ గతంలో కేసు నమోదైంది. రాహుల్ తేజ పోలీస్ ఉన్నతాధికారి కుమారుడు కావడంతో రాష్ట్రంలో ఈ కేసు హాట్‌టాపిక్‌గా మారింది. ఈక్రమంలో రాహుల్ తేజపై గతంలో ఉన్న కేసులు వెలుగులోకి వస్తున్నాయి. ఏడాదిన్నర క్రితం రాహుల్‌తేజ మత్తు పదార్థాలను కారులో మహారాష్ట్ర నుంచి తీసుకొని హైదరాబాద్‌కు బయలుదేరాడు. జిల్లాలోని డిచ్‌పల్లి ఎన్‌హెచ్ 44హైవేపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అతడు డ్రగ్స్‌తో పట్టుబట్టాడు. దీనిపై అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు.